# శ్రీవారిచేత సిగరెట్లు మాన్పించటం ఎలా?

కృష్ణవేణి




ఈ విషయంమీద మా ఊరి మహిళామండలిలో మూడ్రోజులు తీవ్రంగా చర్చలు జరిగాయి. అసలీ చర్చలు ప్రవేశపెట్టింది నేనే. ఎందుకనంటే మావారు కొన్ని నెలల్క్రితంనుంచి సిగరెట్లు తెగకాలుస్తున్నారు. రానురాను ఆ నోరు బొత్తిగా ఫ్యాక్టరీ పొగగొట్టంలా మారిపోతోంది.

వారిని సిగరెట్లు కాల్చకుండా చేయటం ఎలా? అని బుర్ర బద్దలయ్యేట్లు ఆలోచించి చివరకు కొన్ని మార్గాలు కనిపెట్టాను. మొదట నయాన్న చెప్పిచూద్దామని ఒకరోజు ఆఫీసునుంచి వారు వచ్చే టైముకి కాపలాకాశాను. వచ్చీరాగానే వారు కుర్చీలో కూర్చుని సిగరెటు కాల్చటం వారికలవాటు. ఆ మాదిరిగానే జరిగింది. ఆరోజుకూడా. ముందర రిహార్సల్స్ వేసుకున్న ప్రకారం మొదలుపెట్టాను —

"ఏమండీ! సిగరెట్లు అలా కాలుస్తారు కదా ఆరోగ్యం పాడైపోదూ?"

ఆయన మెల్లిగా నావేపు తిరిగి అదోలా నా మొహంలోకి చూస్తూ "మరి నాకిలా కాల్చటమే తెలుసు. ఇంకో పద్ధతి తెలియదు!"

ఆయన వేసిన జోకుకి నాకు నవ్వురాలేదు. అయినా తప్పనిసరిగా నవ్వు రప్పించుకున్నా. నేను నవ్వితే ఆయన తెల్లబోయారు.

రెండు క్షణాలు మౌనంగావుండి, "బావుంది. అలా తెగ పీలుస్తారుకదా వాటిలో ఏముంటుందో" అన్నాను.

"—పొగాకు" అంటూ నవ్వారు.

నాకీమాటుకూడా నవ్వు రాలేదు. అందుకు ప్రయత్నించలేదుకూడా. పైగా నిజం చెప్పాలంటే తెగకోపం వచ్చింది. ఆఖరిసారిగా అడిగాను. సీరియస్‌గా మొహంపెట్టి —

"మీరు సిగరెట్లు కాల్చటం మానేస్తారా? మానరా?"

అందుకు వారు తొణక్కుండా తాపీగా ఎదురుగుండా టీపాయ్ మీది పేపరందుకుంటూ, "మరే కాల్చను." అన్నారు. ఆ మాటకి నా మొహం విజయ గర్వంతో మెరవబోయింది, కాని ఇంతలోకే ఆయన మెల్లిగా, "కాని... పీలుస్తాను!" అన్న మాటలు వినపడగానే నెత్తిమీద పిటకుండ పగిలింది.

తొలి ప్రయత్నంలోనే పరాజయం పొందిన నన్ను పౌరుషం అలక పాన్పు మీదకి తరిమింది.

ఏమయినా సరే ఆయన్చేత సిగరెట్లు మాన్పించే వరకు అలక మానకూడదనుకున్నాను. అలాగే రెండు రోజులు అలకని కంటిన్యూ చేసేను, ఆ రెండు రోజులు పొయ్యిలో పిల్లి లేవలేదు. తను వెళ్ళి హోటల్లో భోంచేసి నాకు క్యారియర్‌లో తీసుకొచ్చేవారు.

మూడో రోజుకి హోటలు భోజనం మొహం మొత్తిందో ఏమిటో మరి మెల్లిగా రాజీకొచ్చారు.

సిగరెట్లు కాల్చను అని గట్టిగా చెప్పాక అలక చాలించి లేచాను. అదేం పాడలవాటోగాని సిగరెట్లు కాల్చటం మానేశాక పిచ్చెక్కినట్లుండే వారు మనిషి! సిగరెట్లు మానేసిన ఆ రెండు రోజుల్లోను మంచకోడిగా తయారయ్యారు. కాస్త ఆ ధ్యాస పోగొట్టి హుషారుగా వుండేటట్లు చేద్దామని ప్రయత్నించి విఫలమయ్యాను.

ఆ తర్వాత ఒక రోజు రాత్రి హఠాత్తుగా మెలకువవచ్చింది. మంచంపక్క కిటికీలోంచి ఆరుబయట తోటలో పువ్వుల మొక్కల మధ్య అప్పుడప్పుడు పొగ, మిణుకు మిణుకుమంటూ నిప్పు రగులుతూ కనబడటం మొదలుపెట్టింది. అది చూస్తుంటే నా పైప్రాణాలు పైనే పోయాయి. గట్టిగా కళ్లు మూసుకున్నాను. రెండు క్షణాలు పోయింతర్వాత మెల్లగా కళ్లు తెరచి చూశాను. అది వున్న చోటుండకుండా అటూ ఇటూ కదులుతున్నట్లు కనబడింది. నా అనుమానం రూఢి అయింది, అది తప్పకుండా కొరివి దయ్యమే అయ్యుంటుంది. ఈ ఆలోచనరాగానే నావళ్ళంతా చెమటలు పట్టేశాయి. ఆయన్ని లేవుదామనిపించింది. కాని భయంతో ఎటూ కదలలేకపోయాను. అలాగే దుప్పటి నిండుగా ముసుగుపెట్టి పడుకున్నాను.

ప్రొద్దున్న లేవగానే కొరివిదయ్యం సంగతి చెప్పాను వారికి. అది వింటూనే విరగబడినవ్వటం మొదలుపెట్టారు. ఆ పరిస్థితిలో ఆయన నవ్వటం నాకు నచ్చకపోయినా చాలా రోజుల తర్వాత (సిగరెట్లు కాల్చటం మానేసిం తర్వాత) నవ్వటం అదే ప్రథమం కనుక నాకు కోపంరాలేదు.

ఇంక ఆపైన కొరివి దయ్యాల్ని నేను చూడని రోజే లేదు. అలాగే బిక్కు బిక్కు మంటూ ఆంజనేయ దండకం చదువుకుంటూ కదలకుండా పడుకునేదాన్ని.

ఒక రోజు రాత్రి అనుకోకుండా కొరివిదెయ్యం రహస్యం బయటపడింది. రోజూకు మల్లే ఆరోజు కూడా కొరివిదయ్యం కనపడ్డం నేను కిమ్మనకుండా పడుకోవటం జరిగింది. అలా పడుకున్న తర్వాత ఒక అరగంట తర్వాత ఎందుకో మెలకువ వచ్చింది కళ్లు తెరిచి కాస్త స్థిమితపడ్డాక ఏదో పాడువాసన ముక్కుని బ్రద్దలు చేస్తోనట్లనిపించింది. కాస్త విదానించి చూసి అది సిగరెటు వాసనని యిట్టే పసిగట్టేశాను. ఎక్కడిదా సిగరెట్లు వాసన? ఎలా వస్తోంది. ఆయన సిగరెట్లు కాల్చటం మాని చాలా రోజులయ్యిందే. అంతే, నా బుర్ర వెంటనే పనిచెయ్యటం మొదలుపెట్టింది. రోజూ కిటికీలోంచి కనిపించే కొరివి దయ్యం ఆ సంగతి ఆయనకి చెప్పగానే మాయం అవ్వటం. ఒకదాని కొకటి అతుక్కుని చూశాను. మిష్టరీ అంతా యిట్టే అర్థం అయింది. అయితే రోజూ రాత్రిళ్ళు నన్ను హడలుకొడ్తున్న కొరివిదయ్యం ఈ సిగరెట్టే నన్నమాట.

అయినా నాకేం తెలియనట్టే నటించాను. పైగ భయం అన్న వంకతో ఒక చేయి ఆయనమీద పడేసి పడుకోవటం మొదలు పెట్టాను. అంతే ఆ రోజునుంచి కొరివి దయ్యం అంకట్టయింది

నాలుగు రోజులు పోయాక ఒకనాడు ప్రొద్దున్నే నీళ్ళు తెచ్చుకుందామని పెరట్లో పైపు దగ్గరకు వెళ్ళాను. నా దృష్టి అప్రయత్నంగా బాత్ రూంవైపు పడింది. బాత్ రూంలోంచి వస్తున్న పొగ నన్ను తెల్లబోయేట్లు చేసింది. ఆ పొగ రావటానికి గల కారణం కనుక్కుందామని అలాగే చూస్తూ నుంచున్నాను. కాసేపటికి బాత్ రూమ్ తలుపులు తెరచుకుని మా శ్రీవారు ఇవతలకు వచ్చారు. నే నిలుచున్న తీరు అదీ ఆయనకి అనుమానం కలిగించి వుంటాయి, కంగారు కప్పిపుచ్చుకుందుకు నాదగ్గరకొచ్చి. "ఏమిటలా చూస్తున్నావు?...బాత్ రూమ్‌లో పొగేమిటా అనికదూ... అదీ... బాయిలర్‌లోంచి వస్తోన్న పొగ. భలే గమ్మత్తుగా వస్తోందికదూ? ... అందుకే అది చూస్తుండడంవల్లే నా స్నానం ఇంత ఆలస్యం అయింది...హిహి!" అంటూ అదో మాదిరిగా నవ్వారు.

ఈమాటు ఆయన సిగరెట్లు కాలుస్తున్నందుకు కాదుగాని నన్ను బొత్తిగా వెర్రిబాగుల్దాన్నిగా జమకడ్తున్నందుకు కోపం వచ్చింది. ఎందుకంటే అంతకు రెండురోజులముందే బాత్ రూమ్‌లో కూడా ఎలక్ట్రిక్ హీటర్ ఎరేంజ్ చేసుకున్నాం. నా కోపాన్ని మాటల్లో గుప్పించి మరింక యిలాగే సిగరెట్లు కాల్చడం కనక చేస్తే పుట్టింటికి పోతానని బెదిరించాను. దాంతో తనింక సిగరెట్ల కాల్చటం మానేస్తానని పుటింటికి వెళ్ళొద్దని పదే పదే బ్రతిమాలారు. ఆయన అలా బ్రతిమాలే తీరు చూస్తే నాకు జాలిముంచుకొచ్చింది.

ఈ సంఘటన జరిగిన కొన్ని రోజులవరకూ ఆయన సిగరెట్లు మానెయ్యటం. కాలుస్తోన్నట్లు అనిపించడం లాంటివి జరగలేదు, నా మట్టుకి నాకు ఆయనకా అలవాటు తగ్గినట్టే అనిపించింది

ఓ రోజు మధ్యాహ్నం నా స్నేహితురాలు పార్వతి వచ్చింది. దానికి ఏడాది క్రితమే పెళ్ళయ్యింది. నాలాగే పార్వతికికూడా సిగరెట్లు కాల్చేవాళ్ళంటే పడదు. పెళ్ళికి ముందు సిగరెట్లు కాల్చేవాడైతే చస్తే చేసుకోనని పట్టుపట్టుకూర్చుంది. చివరికి పెళ్ళికొడుకుని స్వయంగా అదే అడిగేలా ఏర్పాటు చేశారు వాళ్ళమ్మా, నాన్నా. అలాగే వరుణ్ణి అడిగింది. అతను కాల్చనన్నాడు. వెంటనే పెళ్ళి చేసుకుంది అదృష్టం అంటే దాన్దే ననుకున్నాను. అవే మాట తనతో అన్నాను, నా మాటకది ఫక్కుమని నవ్వింది నేను క్వశ్చన్‌మార్కు మొహం పెట్టాను. ఇంతకీ అది చెప్పిన మాటేమిటంటే-

పెళ్ళి చూపుల్లో ఇది కోరినట్టె పెర్సనల్ ఇంటర్‌వ్యూ ఏర్పాటు చేశారుట నాలుగు ప్రశ్నలు అడిగేవో వేశాక ఇది. "సిగరెట్టు కాలుస్తారా?" అందిట. ఆ ప్రశ్న కతను చిరునవ్వుతో "నో!" అన్నాడట. మా పార్వతి పెళ్ళికి ఒప్పేసుకుంది. పెళ్లిలో ఒకటి రెండుసార్లు అతను సిగరెట్లు కాల్చటం చూసిందట. అప్పటికి కోపం అణచుకుని మొదటి రాత్రి అడిగేసిందిట- పెళ్ళిచూపులకొచ్చినప్పుడు ఎందుకబద్ధం చెప్పావని అప్పుడతను పొట్ట చెక్కలయ్యేలా నవ్వేసి" బావుంది. ఆ వేళ సిగరెట్టు కాలుస్తారా? అని అడిగావు. ఆఫర్ చేస్తున్నావని అనుకున్నాను, కాని అలవాటా అని అడిగినట్లనిపించలేదు. నువ్వలా అడిగినందుకు నాకు చాలా ఆశ్చర్యంకూడా వేసింది ఏమో! లేడీస్ బాగా అడ్వాన్సు అవుతున్నారేమోననుకుని సరిపెట్టుకున్నాను!" అన్నారుట. ఆయన సంజాయిషితో మరి దీనికి మాట రాలేదు.

అంతా చెప్పి పార్వతి అంది." ఇప్పుడొక వింత చెప్తాను ఆశ్చర్యపోకేం? . ఇప్పుడు వారు సిగరెట్టు కాల్చబోతే అగ్గిపుల్ల నేనే వెలిగిస్తా.

ఆ మాటకి నేను ఆశ్చర్యపోవటం కాదు రాయయిపోయాను.

ఏమయినా సరే మావార్ని మాత్రం జన్మలో సిగరెట్లు కాల్చనీయకుండా చూడాలనే మొండి పట్టుదల కొచ్చేశాను.

ఆ రోజు ఆదివారం. మాబాబిగాడు కారణం లేకుండానే ఏడుపు మొదలుపెట్టి నా చేతికి, కాలికి అడ్డుతగిలి వంట కానీకుండా చేస్తున్నాడు. వాడి పేచీతో ప్రాణం విసిగిపోతోంది నాకు.

ఇంతలోకే మావారొచ్చి. "వాణ్ణి నేనాడించనా?" అన్నారు.

అంతకన్నా నాకేం కావాలి? అదో వరంలా భావించి "ఊ" అన్నాను.

"బాబీ రామ్మా"అంటూ వాణ్ణి భుజాన వేసుకున్నారు. వాడు ఏడుస్తూనే మావారివెంట వెళ్ళేడు.

"అమ్మయ్య!" అనుకుని వంటలో నిమగ్నమయ్యాను.

కాసేపటికి హాల్లోంచి బాబిగాడి నవ్వు. ఆయన నవ్వు వినపడ్డం మొదలెట్టాయి. నాకు భలే ఆశ్చర్యం వేసింది. ఎంత సముదాయించినా నోరు మూసుకోని వాడు వాళ్ళ నాన్న దగ్గరికి వెళ్ళి ఏడుపు మానటమే కాకుండా నవ్వుతూ ఆడుకోవటం చాలా వింతనిపించింది. ఎలా మరిపించారో తెలుసుకుందామని వంటకి "కామా" పెట్టి హాల్లోకి వెళ్ళేను. హాల్లోకి వెళ్ళగానే అక్కడ నాక్కనపడినదృశ్యం చూస్తూ కొయ్యబారిపోయాను, శ్రీవారు సిగరెట్టును గట్టిగాపీల్చి గాలిలోకి రింగు రింగులుగావదుల్తున్నారు. మా సుపుత్రుడు అదిచూస్తూ ఉత్సాహంతో చప్పట్లు కొడ్తూ ఎగురుతూ "నాన్నా! మల్లీ . మల్లీ..." అంటున్నాడు.

మా వారేదో అద్భుత ఇంద్రజాలికుల్లా తనకొచ్చిన ఆ విద్య మళ్ళిమళ్ళీ ప్రదర్శించివాణ్ణి వినోదపరుస్తున్నారు. నాకు వళ్ళంతా కారం పూసినట్లు భగ్గుమని మండింది. ఇంక ఆ పాడు దృశ్యం చూస్తూ వూరుకోలేక నా రాకను తెలియజేస్తూ గట్టిగా దగాను.

ఆయన ఒక్కమాటు వులిక్కిపడి సిగరెట్టు దూరంగా విసిరేసి లేచి నుంచున్నారు. కొన్ని సెకన్లు అలాగే నాకేసి ఒకమాటు, సిగరెటుకేసి ఒకమాటు — చూస్తూ నిలబడి వున్నట్టుండి "ఏం అలా చూస్తున్నావ్? సిగరెట్లు ఎందుక్కాల్చకూడదూ?... పోతే నా ఆరోగ్యమే పాడయిపోతుంది మధ్య నీకెందుకూ? నీకు ఎలర్జీ అయితే కాలుస్తోన్నప్పుడు నాదగ్గరుండకు! అంతేకాని నన నవసరంగా కట్టుబాటులో ఉంచుదామని ట్రై చేయకు, హు!అందుకే ఆడవాళ్ళ అదుపులో వుంచమన్నది పెద్దలు!... సమానంగా చూస్తోంటే ఇలాగే అన్ని విషయాల్లోను వాళ్ళుచెప్పినట్టే సాగాలంటారు. నువ్వు పుట్టింటికి పోయినాసరే...డైవర్సు ఇస్తానన్నాసరే నాకేం ఫర్వాలేదు! నేనుమాత్రం సిగరెట్లు మానేదిలేదు...అంతే"అంటూ ఊపిరి సలపకుండా నాలుగుముక్కలు కోపంగా అనేసి చెప్పులు తొడుక్కుని వీధిలోకి వెళ్ళిపోయారు.

ఈ అనుకోని తిరుగు బాటుకు ఒక్కక్షణం బిత్తరబోయాను. కాని అప్పటికీ నాకెందుకో వూరుకోబుద్ధవలేదు, నా ప్రయత్నానికింకా ఫుల్ స్టాప్ పెట్టదల్చుకోలేదు. నా నమ్మకం తగ్గలేదు.

"శ్రీవారిచేత సిగరెట్లు మాన్పించటం ఎలా? అనుకుంటూ మరో కొత్త అయిడియా కోసం ఆలోచిస్తూ వంటింట్లోకి నడిచాను!

